


EVENING EDITION

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
21-04-2025
పేజీలు: 02

## ఐపీఎల్‌లో నేడు



కోల్‌కత్తా VS గుజరాత్
కోల్‌కత్తా,
రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్
స్టార్‌లో..

# నేటి నుంచి 3 రోజులు వైన్ షాపులు బంద్



మద్యం ప్రియులకు నిజంగా ఇది బ్యాడ్‌న్యూసే. హైదరాబాద్ నగరంలో మూడ్రోజుల పాటు మద్యం దుకాణాలు క్లోజ్ కానున్నాయి. ఈ నెల 23న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేటి (ఏప్రిల్ 21) నుంచి 3 రోజులు (ఏప్రిల్ 23) వరకు వైన్స్ షాపులు, మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. నేడు సాయంత్రం 4 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని నగర పోలీసులు ఆదేశించారు. అలాగే కౌంటింగ్ జరిగే ఈ నెల 25న కూడా మద్యం దుకాణాలు, క్లోజ్ చేయాలని స్పష్టం చేశారు.కాగా, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈసారి అనేక రాజకీయ సమీకరణాలతో ఆసక్తికరంగా మారాయి. 22 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలు, నగర రాజకీయాల్లో కీలక మార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి. నగరంలో బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉన్న ఎంఐఎం.. 49 ఓట్లతో విజయంపై ధీమాగా ఉంది. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో తమ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీని గెలిపించుకోవాలని చూస్తోంది.

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| గుజరాత్ | 7 | 5 | 2 | 10 |
| ఢిల్లీ | 7 | 5 | 2 | 10 |
| ఆర్సీబీ | 8 | 5 | 3 | 10 |
| పంజాబ్ | 8 | 5 | 3 | 10 |
| లక్నో | 8 | 5 | 3 | 10 |
| ముంబై | 8 | 4 | 4 | 8 |
| కోల్‌కత్తా | 7 | 3 | 4 | 6 |
| రాజస్తాన్ | 8 | 2 | 6 | 4 |
| సన్‌రైజర్స్ | 7 | 2 | 5 | 4 |
| చెన్నై | 8 | 2 | 6 | 4 |


ఆరెంజ్ క్యాప్
368
ఐపీఎల్
అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్
14
ఐపీఎల్
అత్యధిక వికెట్స్




## వీఎఫ్ఎక్స్‌కి 75కోట్లు

మెగా అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'విశ్వంభర'. 'బింబిసార'ఫేం మల్లిడి వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు తగ్గట్టే నిర్మాతలు కూడా ఎక్కడా రాజీ పడటం లేదు. కేవలం వీఎఫ్ఎక్స్‌కే 75కోట్లు ఖర్చు పెడుతున్నారు. హాలీవుడ్ సాంకేతిక బృందం ఈ సినిమాకోసం పనిచేస్తున్నారు. దీంతో దేశంలో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'విశ్వంభర' ఒకటిగా నిలిచింది. ఇందులో కారణజన్ముడిగా చిరంజీవి కనిపిస్తారట. విశ్వంభర అనే లోకానికీ కారణజన్ముడిగా పుట్టిన ఓ మానవుడికీ మధ్య సంబంధం ఏంటి ? అనేదే ఈ సినిమా కథ అని సమాచారం. త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అశికా రంగనాథ్, ఇషా చావ్లా, సురభి పురానిక్, కునాల్ కపూర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: వి. వంశీకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డి, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.




### 18 ఏళ్లు దాటిన వారందరికీ

# క్యాన్సర్ టెస్టులు ఫ్రీ

ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ ఒక పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది. ఏటా క్యాన్సర్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాలలో క్యాన్సర్ ఒకటి. రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్లు వంటివి ఎక్కువగా నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో నెలకు సగటున 1,000 కొత్త క్యాన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నాయి. గత నాలుగేళ్లలో ఇక్కడ 49,166 కేసులు నమోదయ్యాయి. చాలా మందిలో క్యాన్సర్ లక్షణాలు ముందుగా కనిపించక, చివరి దశలోనే గుర్తిస్తున్నారు, ఈ దశలో చికిత్సలు ఫలితం ఇవ్వడం కష్టం.


ఆరోగ్యశ్రీ కేసుల్లోనూ క్యాన్సర్ చికిత్సలు ఎక్కువగా ఉన్నాయి.ఈ నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసకుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ముందస్తు గుర్తింపుతో రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని సర్కారు భావిస్తోంది. రాష్ట్రంలో నమోదవుతున్న కేసుల్లో 41 శాతం ఓరల్, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు ఉన్నాయి. ఈ మూడు రకాల క్యాన్సర్లపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రభుత్వం 10 ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది, మొదటి దశలో భద్రాద్రి-కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కరీంనగర్‌లో రూ.50 కోట్లతో కేంద్రాలు నెలకొల్పుతారు.

రెండో దశలో మరో ఐదు కేంద్రాలు ఏర్పాటవుతాయి. ఈ కేంద్రాల్లో మెడికల్, సర్జికల్, రేడియో థెరపీ సేవలు అందుబాటులో ఉంటాయి. అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ చికిత్స కేంద్రాలు, కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ సేవలు అందిస్తారు. జిల్లాకు ఒక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం ప్రవేశపె డతారు, ఇందులో ఆంకాలజిస్టులు, పారామెడికల్ సిబ్బంది ఉంటారు. మొబైల్ వాహనాలు గ్రామాలను సందర్శించి.. 18 ఏళ్లు దాటిన వారందరికీ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తాయి, కంటివెలుగు తరహాలో తేదీలను ముందుగా ప్రకటిస్తారు. క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే, జిల్లా కేంద్రాలకు, అవసరమైతే ప్రాంతీయ కేంద్రాలకు లేదా హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రికి రోగులను సిఫారసు చేస్తారు.

## సమంత రెండో పెళ్లి..

# నిజమేనా?

సమంత – నాగచైతన్య విడిపోయాక సామ్ ఒంటరిగానే ఉంటుంది. అయితే, సమంత రెండో పెళ్లి పై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ గురించి తెలిసిందే. తాజాగా ఈ వార్త పై మళ్లీ రూమర్ వైరల్ అవుతుంది. సమంత రెండో పెళ్లికి సిద్ధమవుతుందని, తన బాయ్ ఫ్రెండ్ రాజ్ నిడుమోరుతో ఆమె పెళ్లి పీటలు ఎక్కబోతుందని టాక్ నడుస్తోంది. వీరిద్దరూ కలిసి నిన్న తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దీంతో ఈ రూమర్ కి బలం చేకూర్చినట్లు అయింది. పైగా, ఇప్పటికే వారిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని, మే నెలలో పెళ్లిపీటలు ఎక్కబోతున్నారని కొత్తగా గాసిప్ వినిపిస్తోంది. అన్నట్టు సామ్ – రాజ్ పెళ్లికి ఇరు కుటుంబాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై ఇటు సమంతగానీ, అటు రాజ్‌గానీ స్పందించలేదు.





## దేశంలో కొనసాగుతున్న జేడీ వాన్స్ పర్యటన

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన కుటుంబంతో కలిసి భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ రోజు ఉదయం వారి విమానం ఢిల్లీలోని పాలం టెక్నికల్ ఏరియాలో ల్యాండ్ అయింది. అక్కడ వారికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడి పిల్లల వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి ఇద్దరు కుమారులు, కూతురు భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. భారతీయ సంప్రదాయ ఉట్టిపడేలా కుమారులు ఇద్దరు కుర్తా, పైజామా ధరించగా... కూతురు అనార్కలి స్టైల్‌లో రూపొందించిన ఫుల్ లెంగ్త్ డ్రెస్సులో కనిపించారు.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. ఈరోజు( సోమవారం) ఉదయం ఏడున్నరకు చనిపోయినట్లు వాటికన్ వర్గాలు ప్రకటించాయి. దీనిపై వీడియో ప్రకటనను వాటికన్ విడుదల చేసింది. వాటికన్ కామెర్లెంగో కార్డినల్ కెవిన్ ఫెర్రెల్ ఈ విషాద వార్తను ప్రకటించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పోప్ ఫ్రాన్సిస్.. వాటికన్ సిటీలో కన్నుమూశారు. ఉదయం 7:35 గంటలకు రోమ్‌లోని జెమెల్లి ఆసుపత్రిలో ఫ్రాన్సిస్ కన్నుమూశారు.

### 12 ఏళ్ల వయస్సు నుంచే..

నిన్న ఈస్టర్ వేడుకల్లో ఆయన పాల్గొనడం విశేషం. ఆయన 88 సంవత్సరాల వయస్సులో మరణించారు. పోప్ ఫ్రాన్సిస్ తన 12 ఏళ్ల వయస్సు నుంచే చర్చి, సమాజం, అట్టడుగు వర్గాల కోసం అంకితమై పనిచేశారు. ఆయన జీవితం విలువలతో నిండి ఉందని, విశ్వాసం, ధైర్యం, సార్వత్రిక ప్రేమకు పోప్ ప్రతీక అని ఫెర్రెల్ తెలిపారు. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో



జన్మించిన పోప్ ఫ్రాన్సిస్.. 2013 మార్చి 13న 266వ పోప్‌గా ఎన్నికయ్యారు.


### మార్పునకు మార్గదర్శకుడు

మార్చి 23న, పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్య సమస్యల నుంచి కోలుకుని ఆసుపత్రి నుంచి పోప్ డిశ్చార్జ్ అయ్యారు. న్యూమోనియాతో ఐదు వారాల చికిత్స తరువాత ఆయన తిరిగి వాటికన్‌కు చేరుకున్నారు. వయస్సు, ఆరోగ్య సమస్యలు ఉన్నా కూడా ఆయన సేవ విషయంలో మాత్రం వెనుకడుగు వేయకుండా ముందుకు కొనసాగారని చెప్పవచ్చు. 2013లో పోప్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఫ్రాన్సిస్ చాలా విషయాల్లో తన ప్రత్యేకతను చూపించారు.

### వాటికన్‌ను మార్చునకు కృషి

వాటికన్ ఆర్థిక వ్యవస్థ, పాలనను సంస్కరించడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. మతపరమైన సంప్రదాయాలు, సమాజానికి ఉపయోగపడే అనేక విషయాలను అనుసరించారు. వలసదారులు, పేదలు, ఖైదీలు, అణగారినవారు అందరికీ చోటు ఇవ్వాలనే తపనతో ఆయన ముందుకు సాగారు. పర్యావరణ పరిరక్షణ, అణు ఆయుధాలపై వ్యతిరేకత, శాంతియుత జీవన విధానంపై ఆయన చేసిన ప్రచారం అనేక మందికి మార్గదర్శనం అయ్యింది. దీంతోపాటు చర్చిలలో మహిళలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు పోప్.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ఆన్‌లైన్ గేమ్స్‌కు మరో యువకుడు బలయ్యాడు

ఆన్‌లైన్ గేమ్స్‌కు మరో యువకుడు బలయ్యాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్న అతడు మరో మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాలో జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం పరిగి మండలంలోని పైడేటి గ్రామానికి చెందిన 23 ఏళ్ల జయచంద్ర డిగ్రీ వరకు చదువుకున్నాడు. రెండు సంవత్సరాల క్రితం గ్రామంలో డెయిరీ ప్రారంభించి నడుపుతున్నాడు. పాడి రైతుల నుంచి సేకరించిన పాలకు సంబంధించి రైతులకు 3 లక్షల రూపాయల వరకు బాకీ పడ్డాడు. దీంతో వారి నుంచి ఒత్తిడి పెరిగింది. మరోవైపు ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడి రూ. 3 లక్షలు అప్పు చేసి నష్టపోయాడు. దీంతో నెల రోజుల క్రితం డెయిలీని మూసేశాడు. ఉద్యోగం కోసం బెంగళూరు వెళుతున్నట్టు చెప్పి శనివారం ఇంటి నుంచి బయలుదేరాడు. అదే రోజు రాత్రి హిందూపురం పట్టణ పరిధిలోని గుడ్డం సమీపంలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు ముందు జయచంద్ర తన చొక్కాపై ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని రాశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీజేపీపై కుట్రపన్నాయి



హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని ఓడించేందుకు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికార, ప్రతిపక్ష పార్టీలు కావాలనే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నాయని అన్నారు. ఈ రెండు పార్టీలు మజ్లిస్ పార్టీకి అండగా నిలుస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయలేదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.ఓటు వేయడం ప్రజాస్వామ్యంలో హక్కు అని, కానీ కార్పొరేటర్లు ఓటు వేయకుండా బీఆర్ఎస్ అగ్రనేతలు బెదిరిస్తున్నారని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ రజాకార్ల వారసుల పార్టీ అని ధ్వజమెత్తారు. మతతత్వ మజ్లిస్ పార్టీతో చేతులు కలిపిన కాంగ్రెస్, బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయని ప్రశ్నించారు.బీజేపీకి బలం లేకపోయినప్పటికీ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచింది. దీంతో ఈ ఎన్నికలు ఆసక్తిగా మారాయి.



## 23న ఏపీ 10వ తరగతి ఫలితాలు విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 23వ తేదీన విడుదల చేసేందుకు పాఠశాల విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు 6 లక్షల 19 వేల 275 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇంగ్లిష్ మీడియంకి సంబంధించి 5 లక్షల 64 వేల 64 మంది విద్యార్థులు కాగా.. తెలుగు మీడియం వాళ్లు 51 వేల 69 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులు తమ ఫలితాలను మనమిత్ర వాట్సప్ (WhatsApp) నంబర్‌లోనూ (9552300009) లేదా అధికారిక వెబ్‌సైట్ https://www.bse.ap.gov.in/ ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం వాట్సప్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలు తెలుసుకోవచ్చు. దీనికోసం ముందుగా ఈ నెంబర్ మీ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. వాట్సాప్ ఓపెన్ చేసి ఈ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపించాలి. వెంటనే మీకు సర్వీసెస్ ఎంపిక చేసుకోమని వస్తుంది. అందులో ఎడ్యుకేషన్ సర్వీసెస్ క్లిక్ చేస్తే పదో తరగతి ఫలితాల లింక్ కన్పిస్తుంది. ఇది క్లిక్ చేసి మీ పుట్టిన తేదీ, హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేస్తే పీడీఎఫ్ రూపంలో మీ మార్కుల మెమో వస్తుంది.



పశ్చిమ బెంగాల్‌లో హింసపై నేడు

## సుప్రీంకోర్టులో విచారణ..!

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర 24 పరగణాల జిల్లాల్లో జరిగిన హింసపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆయా పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారించే అవకాశం ఉన్నది. హింసాకాండలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా.. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సిట్‌తో విచారణ జరిపించాలంటూ పిటిషనర్ డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 11న జరిగిన హింసపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని న్యాయవాది శేఖర్ ఝా పిటిషన్‌లో కోరారు. పశ్చిమ బెంగాల్, కేంద్ర ప్రభుత్వాలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. బెంగాల్‌లో జరుగుతున్న మతపరమైన, రాజకీయ హింస ఘటనలపై దర్యాప్తు చేసేందుకు సిట్ ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కోరారు. శాంతిభద్రతల యంత్రాంగం వైఫల్యం గురించి ప్రతివాదుల నుంచి వివరణ కోరాలని కూడా పిటిషనర్ కోర్టును కోరారు. బాధితులకు పరిహారం, పునరావాసం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు భద్రతతో పాటు స్వేచ్ఛగా ఉండేలా.. హింస పెరగకుండా ప్రభుత్వాలు ఆపేలా చూడాలని.. ఈ మేరకు సముచితమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టు కోరారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరుగనున్నది.

# యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు



తెలంగాణలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో ఉదయం నుంచే భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అధిక రద్దీ కారణంగా ఉచిత దర్శనానికి దాదాపు 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి గంటకు పైగా సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేసవి వేడిని తట్టుకునేందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఇక ఇటీవల ఎండోమెంట్స్ సవరణ బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లు యాదగిరిగుట్ట ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం చేసింది. ప్రతిపాదిత యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు లో చైర్మన్‌తో సహా 18 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఎస్సీ, బీసీ వర్గాల ప్రతినిధులు, ఒక మహిళా ప్రతినిధి మరియు ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ ఉంటారు. ఒక ఐఏఎస్ అధికారిని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తారు. బోర్డు సభ్యుల పదవీ కాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. స్వయంప్రతిపత్తి కలిగిన టీటీడీ బోర్డు మాదిరిగా కాకుండా, యాదగిరిగుట్ట బోర్డు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుంది. బోర్డుకు అవసరమైన బడ్జెట్‌ను కూడా ప్రభుత్వమే కేటాయిస్తుంది. పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని యాదగిరిగుట్ట ఆలయ నిర్వహణ, పరిపాలన, అభివృద్ధిని సమర్థవంతంగా చూసుకోవడం ఈ బోర్డు ఏర్పాటు యొక్క ప్రధాన లక్ష్యం. ఆలయం పరిధిలోని విద్యా సంస్థలు, వేద పాఠశాలలు, గోశాల నిర్వహణను కూడా ఈ బోర్డు పర్యవేక్షిస్తుంది. యాదగిరిగుట్ట ఆలయం చుట్టూ ఉన్న 1,241 ఎకరాలను మూడు మున్సిపాలిటీలు, ఆరు గ్రామాలను కలుపుకొని "టెంపుల్ సిటీ"గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. వైటీడీ బోర్డు ఆధ్వర్యంలో వేద విద్యా సంస్థలను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.



## పాడుతా తీయగా షోపై సింగర్ ప్రవస్తి ఆరోపణలు


లెజండ్రీ సింగర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 1996లో ప్రారంభించిన 'పాడుతా తీయగా' షో ఇప్పటికీ ఆడియన్స్ మనసుల్ని గెలుచుకుంటూ ముందుకు సాగుతోంది. ఎస్పీబీ లేకపోయినా ఆయన కుమారుడు ఎస్పీ చరణ్ షోని హోస్ట్ చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు. ఇక తాజాగా మొదలైన ఈ షో సిల్వర్ జూబ్లీ సిరీస్‌కి మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి, సింగర్ సునీత, రచయిత చంద్రబోస్ జడ్జీలుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఈ షోపై సింగర్ ప్రవస్తి తాజాగా సంచలన కామెంట్స్ చేసింది.ఈ షో నుంచి ఇటీవలే ప్రవస్తి ఎలిమినేట్ అయింది. నిజానికి ప్రవస్తి ఎంత గొప్ప సింగర్ అనేది అందరికీ తెలుసు. గతంలో సూపర్ సింగర్ సహా ఎన్నో షోలలో విజేతగా నిలిచింది. అలాంటి ప్రవస్తి ఇంత త్వరగా షో నుంచి ఎలిమినేట్ అవడం ఆడియన్స్‌ని ఆశ్చర్యపరిచింది. ఇక తన ఎలిమినేషన్‌పై ప్రవస్తి రియాక్ట్ అవుతూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో వరుస పోస్టులు పెట్టింది."పాడుతా తీయగా ప్రోగ్రామ్‌కి వెళ్లాలనుకుంటున్న సింగర్స్‌కి నా సలహా ఒక్కటే. ఏమైనా రికమండేషన్స్ లేదా జడ్జీల నుంచి రిఫరెన్స్‌లు ఉంటే మాత్రమే షోలో పార్టిసిపేట్ చేయండి. ఆ రెండూ లేకుండా వెళ్తే మీకు అన్యాయం, మానసిక వేదన మాత్రమే ఎదురవుతాయి." అంటూ ప్రవస్తి ఆవేదన వ్యక్తం చేసింది.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ జాలరికి భారీ చేప దొరికిన వైనం



జీవనోపాధి కోసం మిడ్ మానేరు జలాశయంలో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడికి ఊహించని అనుభవం ఎదురైంది. వల లాగుతుండగా అది విపరీతంగా బరువుగా అనిపించడంతో మొదట ఆందోళన చెందినా, ఒడ్డుకు చేర్చాక అందులోని భారీ చేపను చూసి ఆశ్చర్యపోయాడు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే తంగళ్లపల్లి గ్రామానికి చెందిన గోలాడ నరేశ్ అనే మత్స్యకారుడు నిత్యం మిడ్ మానేరు జలాశయంలో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం కూడా యథావిధిగా తన పడవలో జలాశయంలోకి వెళ్లి వల విసిరాడు. కొంత సమయం తర్వాత వల లాగేందుకు ప్రయత్నించగా, అది అసాధారణంగా బరువుగా ఉండటాన్ని గమనించాడు. ఏదో పెద్ద చేపే పడిందని భావించినా, ఇంత బరువు ఉంటుందని ఊహించలేదు.వల చిరిగిపోతుందేమోనన్న భయంతో, ఒంటరిగా లాగడం కష్టమని గ్రహించి, సమీపంలో ఉన్న మరో జాలరి సహాయం తీసుకున్నాడు. ఇద్దరు కలిసి అతి కష్టం మీద వలను ఒడ్డుకు లాగారు. వలలో చిక్కుకున్న భారీ చేపను చూసి నరేశ్‌తో పాటు అక్కడున్నవారు నివ్వెరపోయారు. అది భారీ సైజులో ఉన్న 'బొచ్చ' చేప. వెంటనే ఆ చేపను తూకం వేయగా, అది సరిగ్గా 32.5 కిలోల బరువు తూగింది.సాధారణంగా మిడ్ మానేరులో 5 నుంచి 10 కిలోల చేపలు దొరుకుతాయని, కానీ ఇంత పెద్ద చేప చిక్కడం చాలా అరుదని నరేశ్, ఇతర మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ భారీ చేప వార్త క్షణాల్లో చుట్టుపక్కల గ్రామాలకు పాకింది. నరేశ్ ఆ చేపతో దిగిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇంత పెద్ద చేపను చూసేందుకు స్థానికులు, గ్రామస్తులు నరేశ్ ఇంటికి తరలివచ్చారు. సముద్రంలో దొరికేంత పెద్ద చేప తమ మిడ్ మానేరులో లభించడంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ భారీ చేప నరేశ్‌కు నిజంగా జాక్‌పాట్ లాంటిదని పలువురు వ్యాఖ్యానించారు.

## భారత్‌లో ఎన్నికల సంఘం రాజీ పడింది



కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలో ఎన్నికల సంఘం రాజీ పడిందని ఆరోపించారు. అంతేకాదు, ఆ వ్యవస్థలో చాలా లోపాలున్నాయన్నారు. ఇందుకు ఇటీవలే జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలనుఉదాహరణగా చెప్పారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ బోస్టన్‌లో భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఈసీపై ఈ వ్యాఖ్యలు చేశారు.'భారతదేశంలో ఎన్నికల సంఘం రాజీ పడింది. ఆ వ్యవస్థలో చాలా లోపాలు ఉన్నాయని మాకు స్పష్టంగా తెలుసు. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు ప్రస్తావించాను. ఇటీవలే మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల మధ్య 65 లక్షల మంది ఓటు వేసినట్లు ఎన్నికల సంఘమే స్వయంగా ప్రకటించింది. అంత తక్కువ సమయంలో అంతమంది ఎలా ఓటు వేస్తారు. ఇది భౌతికంగా అసాధ్యం. అక్కడ ఏదో తప్పు జరిగిందని స్పష్టంగా తెలుస్తోంది. దీంతో మేము వీడియోలు చూపించాలని అడిగాం. అందుకు ఈసీ తిరస్కరించింది. ఇప్పుడు అలా అడగడానికి వీలు లేదంటూ చట్టాన్ని కూడా మార్చేశారు' అని రాహుల్ ఆరోపించారు.

## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్.. 8 మంది మావోయిస్టులు మృతి



జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో మావోయిస్టులు, భద్రతాబలగాలకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతిచెందారు. సోమవారం తెల్లవారుజామున బొకారో జిల్లాలోని లాల్‌పానియా ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నరన్న సమాచారంతో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 209 కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) దళాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 5.30 గంటల సమయంలో లుగు కొండల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. పోలీసుల కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు చనిపోయారని సీఆర్‌పీఎఫ్ అధికారులు వెల్లడించారు. మృతులను గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలంలో ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లతోపాటు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆ ప్రాంతంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడించారు. కాగా, ఈ నెల 14న జార్ఖండ్‌లోని పశ్చిమ సింఘ్‌భమ్ జిల్లాలో 11 మావోయిస్టు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా బాక్రబేదా అటవీ ప్రాంతంలో రెండు ఐఈడీలను గుర్తించారు. వాటిని బాంబు స్క్వాడ్ సిబ్బంది నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే.